క్లుప్తంగా

నియామకం



కుంచాల సాయిరామ్

మలక్‌పేట: ఏబీవీపీ దిల్‌సుఖ్ నగర్ కన్వీనర్‌గా ఎల్‌బీనగర్ నాగోల్‌కు చెందిన కుంచాల సాయిరామ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యారంగ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఏబీవీపీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ బాలాజీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అప్‌టౌన్ డెంటల్, స్కీన్ క్లినిక్‌ను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ జ్ఞాన కిరీటి, డాక్టర్ భవనా, వెంకటచౌదరి, గుమ్మడి వెంకటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నేత కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎల్‌బీనగర్: స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సరూర్‌నగర్ ప్రథమిక ఆరోగ్య కేంద్రం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆరోగ్య కేంద్ర వైద్యురాలు అర్చనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ... ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు చేయడంతో పాటు ప్రస్తుతం రూ. 10 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2021 జూలై నుంచి పీఆర్సీని వెంటనే చెల్లించాలని, కరోనారీస్ ఎలవెన్స్ కింద నెలకు రూ. వెయ్యి చొప్పున ఇవ్వాలని కోరారు. 32 రకాల రిజిస్టర్‌లను వెంటనే ప్రింట్ చేసి కార్మికుల ఇవ్వడంతో పాటు ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ ఖర్చులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వీరయ్య, ఆలేటి ఎల్లయ్య, దర్గారావు, శ్యామల, అన్నపూర్ణ, అశ్విన్, కృష్ణవేణి, లావణ్య, సుధా, సంగీత, అరుణ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

అంధ క్రికెటర్ మహేందర్‌కు సత్కారం



నాగోలు: అంధుల క్రికెట్‌లో ప్రపంచ కప్ సాధించిన భారత జట్టు సభ్యుడు మహేందర్ వైష్ణవ మన తెలుగు వారందరికీ గర్వ కారణమని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం నాగోల్‌లోని ప్రముఖ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో జరిగిన అంధుల మార్గదర్శి లూయిస్ బ్రెయిలీ జయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రముఖ అంధ క్రికెటర్ మహేందర్ వైష్ణవను దుశ్శాలువా, జ్ఞాపిక ప్రశంస పత్రంతో ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... మహేందర్ వైష్ణవ అంతర్జాతీయ మాచ్‌లో ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసి రికార్డు సృష్టించారన్నారు. ఆల్ రౌండర్‌గా ప్రతిభ చూపి 2018 ప్రపంచ కప్ భారత క్రికెట్ జట్టు గెలవడంలో కీలక పాత్ర పోషించారన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత గంప గోవర్ధన్ మాట్లాడుతూ... మహేందర్ వైష్ణవ క్రికెట్‌లోనే కాకుండా ఫుట్‌బాల్, చెస్ లాంటి క్రీడల్లోనూ రాణించడం గొప్ప విషయం అన్నారు. ఇలాంటి గొప్ప క్రీడాకారులను ఆకృతి సంస్థ సత్కరించడం అభినందనీయమన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడీ టు సర్వ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శంకర్, సామాజిక వేత్త గుర్రం ప్రకాష్, అధ్యాపకులు నరేందర్, పలువురు క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇమ్లిబన్, గౌస్ కేఫ్, యూనిక్ స్కూల్, ముర్తుజానగర్, సాదత్‌నగర్ కబరస్తాన్, సాదత్‌నగర్, మౌలా కా చిల్లా, హుస్సేనీకోటి, రహ్మానియా స్కూల్, అక్బర్‌దొడ్డి, రెహమాన్ నగర్, సోమ్‌నాథ్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

రోడ్లన్నీ అధ్వానమే..!

- అన్ని ప్రాంతాల్లోని రోడ్లూ గుంతలమయం
- మరమ్మతులు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం
- ప్రమాదాలబారిన వాహనదారులు
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తుంటే... మరికొన్ని ప్రాంతల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. అయినా గుంతలు పడిన రహదారులకు మరమ్మతులు చేసే విషయంలో అధికార యంత్రాంగం తీరు విమర్శలకు దారితీస్తోంది.



కమలానగర్ కాలనీలో గుంతలు పడ్డ రహదారి



వీవీనగర్ కాలనీలో అధ్వానంగా మారిన రోడ్డు



లలితానగర్ కాలనీలో రహదారి మధ్యలో గుంతలు



గౌతంనగర్ కాలనీలో గుంతలు పడ్డ రోడ్డు

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌లోని కాలనీలలో ప్రధాన, అంతర్గత రోడ్లు గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. మరమ్మతుకు నోచుకోక వాహనదారులు కాదుకగా పాదచారులు సైతం రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనడం అతిశయోక్తికాదు.

- కమలానగర్, వీవీనగర్, లలితానగర్, పీ అండ్ టీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, కృష్ణానగర్, శారదానగర్, కోదండరాంనగర్ తదితర కాలనీలలో ఉన్న సీసీ రోడ్లు పాడైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- పన్నులు ముక్కు పిండి వసూలు చేసే అధికారులు ప్రజలకు కనీస వసతులను కల్పించే విషయంలో నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మండిపడుతున్నారు.
- అభివృద్ధి పనుల కోసం తవ్వకాలు జరిపి పనులు పూర్తి అయిన వెంటనే రోడ్లకు ప్యాచ్ వర్కులు చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో అవి వాహనాల రాకపోకలతో మరింత పెద్దవై రోజు జోజుకూ పరిస్థితి అధ్వానంగా తయారైందని కాలనీల ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.
- ఇష్టారాజ్యంగా రోడ్డు తవ్వకాలు జరుపుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోంటం లేదంటున్నారు. కంకరతేలి, గుంతలుగా మారిన రోడ్లపై వాహనాలు నడపాలంటే భయపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కార్పొరేటర్, అధికారులు వెంటనే స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అన్ని రహదారులూ ఇలాగే..



డివిజన్‌లోని ఏకాలనీలో చూసినా రహదారులు ఘోరంగా ఉన్నాయి. సీసీ రోడ్డు అన్ని గుంతలు పడ్డాయి. రోడ్లు నిర్మించేటప్పుడు మొదలుకొని మరమ్మతులు చేసేదాకా పనులు నాణ్యతలేమితో చేసినందునే ఈ దుస్థితి దాపురించింది. ఆ రోడ్లపై వాహనాలు నడపాలంటే భయమేస్తోంది. డ్రైనేజీ, తాగునీటి పైపులు వేసేందుకు తవ్విన రహదారులు ప్యాచ్ వర్కులకు నోచుకోక పోవటంతో గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. రోడ్డు మరమ్మతులు చేయటంలో ఎందుకీ నిర్లక్ష్యం. రహదారుల మధ్యలో ఉండే మ్యాన్‌హోల్ కవర్లు కుంగి పోయి ప్రమాదాలు జరుగున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రహదారులు బాగుచేసేలా చూడాలి. – రాచకొండ రాజు, పీఅండ్‌టీ కాలనీ

వరదనీటి సమస్యకు త్వరలో చెక్

ఎల్‌బీగనర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



నాగోలులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నాగోలు: నాగోలు చెరువు కింద ఉన్న కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరదనీటి సమస్యకు త్వరలోనే విముక్తి కల్పిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి నాగోలు డివిజన్ పరిధిలోని మమతా నగర్, సాయిరాంనగర్ కాలనీ, వెంకట్‌రెడ్డినగర్, గ్రీన్‌ఫీల్డ్‌నగర్, శ్రీ వెంకటరమణ, పద్మావతీ కాలనీ, బీకేరెడ్డినగర్‌లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఎస్‌ఎన్‌డీపీ డీఈ కృష్ణయ్య, వెంకట్‌కిరణ్‌లతో కలసి ఎమ్మెల్యే వివిధ కాలనీల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... వరదనీరు పోవడానికి పైప్ లైన్స్ మరొక్కచోట బాక్స్ డ్రైన్స్ పనులు చేయడం జరుగుతుందన్నారు. బాక్స్ డ్రైన్స్ పనుల్లో భాగంగా ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, నేతలు చంద్రశేఖర్ ఆజాద్, శ్రీధర్ గౌడ్, రమేష్, బద్దం నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న క్రాంతి కుమార్ తదితరులు

హస్తినాపురం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మొయినాబాద్‌లో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే భగత్‌సింగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం హస్తినాపురంలోని సాగర్‌రోడ్డులోని నవీన కళాశాల ఆవరణలో క్రికెట్ టోర్నమెంట్‌ను సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ... ఇప్పటికే 16 టీంలు వచ్చాయని ఒక టీంకు ఎంట్రీ ఫీజు రూ. 3600 అని మొదటి బహుమతిగా రూ. 30 వేలు, రెండవ బహుమతిగా రూ. 15 వేలుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మ్యాన్ ఆఫ్ దమ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ ఉంటాయని, క్యాస్ ప్రైజ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ మండల ఏఐఎస్‌ఫ్ కార్యదర్శి పి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మదిదోచే కళాఖండాలు

ఆలిండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు మంచి ఆదరణ



వనస్థలిపురం: వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, గృహోపకరణాల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో కొలువైన మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లెనిన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, లెదర్ బ్యాగులు, బెల్ట్‌లు, పర్స్‌లు, తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని మేళా నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. మేళా రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.



కేలండర్ ఆవిష్కరణ

చంచల్‌గూడ: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను చార్మినార్ డిప్యూటీ డీఈఓ నెహ్రూబాబు శుక్రవారం చంచల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రశాంత్‌రెడ్డి, నరసరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హస్తినాపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



అధికారులతో కలిసి మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చి దిద్దుతానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం వివేకానందనగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సుజాతానాయక్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వివేకానందనగర్, కాలనీ అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8న ముగ్గుల పోటీలు

నాగోలు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తపేట బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, మారుతీనగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన (ఆదివారం) మధ్యాహ్నం కొత్తపేటలో మారుతీనగర్ జైన్ మందిర్ దగ్గర ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు లింగాల రాహుల్‌గౌడ్ తెలిపారు. ముఖ్య అతిథులుగా దేవిరెడ్డి కమల సుధీర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఆకర్షణీయంగా వేసిన ముగ్గులను గుర్తించి వాటిని వేసిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు ఫోన్: 97001 23222లో సంప్రదించాలని సూచించారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

విజయవంతం చేయండి : వంగా మధుసూదరన్‌రెడ్డి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: నాగోల్‌లోని శుభం ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించనున్న ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని బూత్‌స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి కోరారు. శుక్రవారం కర్మన్‌ఘాట్‌లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ క్రియాశీలక కర్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతున్నారన్నారు. బూత్‌స్థాయి పార్టీ కార్యకర్తలు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్‌బీనగర్ బూత్ స్థాయి ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు రజిత, శైలజ, జ్యోతి, యోగిరాజ్, శ్రీనివాస్, సందీప్, అంజి, సందీప్‌రెడ్డి, సుంకరి రమేష్, వీరారెడ్డి, అవినాష్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి వార్షికోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న పాస్టర్ వన్య ఇమ్మానియల్, సభ్యులు

మలక్‌పేట: మూసారంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి సభ్యులు ఎమ్మెల్యే అహ్మద్ బలాలను పంజేషాహలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ నెల 8వ తేదీన (ఆదివారం) నిర్వహించనున్న చర్చి వార్షికోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేసినట్లు శుక్రవారం చర్చి పాస్టర్ వన్య ఇమ్మానియల్ తెలిపారు. చర్చి ఫౌండర్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎం.ఎస్ ప్రభుచరణ్ వ్యాకోపదేశం చేస్తారని తెలిపారు.

నడ్డాతో కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయండి



వివరాలు వెల్లడిస్తున్న ధీరజ్‌లాల్, జంగం మధుకర్‌రెడ్డి

సైదాబాద్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో శనివారం నిర్వహించే నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాన్ని వియవంతం చేయాలని యాకత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ ధీరజ్ లాల్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఐఎస్‌సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... శనివారం తెలంగాణలోని 119 నియోజకవర్గాల బూత్‌స్థాయి కార్యకర్తలతో నడ్డా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ సమావేశంలో మాట్లాడతారని వివరించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అవలంబించాల్సిన వ్యూహాలను ఆయన నిర్దేశిస్తారని తెలిపారు. యాకత్‌పురా అసెంబ్లీ బూత్ స్థాయి కార్యకర్తల సమ్మేళనం శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని భరత్ గార్డెన్స్‌లో నిర్వహించబడుతుందని వారు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, నిరంజన్ యాదవ్, అజయ్, అభిజిత్ పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి



వ్యాయాయం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వ్యాయామం చేసేందుకు ఔత్సాహిక యువత ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా కాస్మోపాలిటన్ కాలనీలోని ఓపెన్ జిమ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఓపెన్ జిమ్ ఉన్న ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. స్థానిక నేతలు నవీన్‌గుప్తా, శివ, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో అమెరికా వైద్య విద్యార్థులు

వనస్థలిపురం: అమెరికాకు చెందిన విస్కాన్సన్ యూనివర్సిటీ వైద్య విద్యార్థులు శుక్రవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. స్టడీ టూర్‌లో భాగంగా నగరానికి వచ్చిన విద్యార్థులు ఏరియా ఆస్పత్రుల పనితీరు తెలుసుకునేందుకు ఆస్పత్రికి వచ్చారు. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ జయంత్ ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, ఓపీ, లేబర్ వార్డు, వసతులు, వివిధ విభాగాల పనితీరును వారికి వివరించారు. ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సరీస్వెస్ డాక్టర్ రమణారావు ఏరియా ఆస్పత్రిలో అందే సేవలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆస్పత్రుల నుంచి వచ్చే రెఫరెన్స్‌లను వివరించారు. డాక్టర్ భాగిష్ మిశ్రా, 108 ప్రోగ్రామ్ మేనేజర్ నరేందర్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, డాక్టర్లు పాల్గొన్నారు.

లీజు రద్దు చేసి ఆస్పత్రిని విస్తరించాలి

చంచల్‌గూడ: ప్రభుత్వ ఆస్పత్రుల స్థలాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం కుర్మగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మలక్‌పేట్ ఏరియా ఆస్పత్రి స్థలంలో కొనసాగుతున్న సోహేల్ హోటల్ లీజును ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలు పాకి ఉంటే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగేదన్నారు. పాతబస్తీ ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ ఆస్పత్రిని మరింత విస్తరించాలన్నారు. హోటల్ తొలగించి ఆస్పత్రి కోసం వినియోగించాలన్నారు.

వరద కాదు మురుగు..

- భైరామల్‌గూడ చెరువు వద్ద మరమమ్మతులు
- మ్యాన్‌హోళ్ల నుంచి పొంగి రోడ్లను ముంచెత్తిన మురుగు



మురుగుతో చెరువును తలపిస్తున్న సరూర్‌నగర్-కర్మన్‌ఘాట్ రోడ్డు



విద్యార్థులను తీసుకెళ్లే ఆటో...



లింగోజిగూడ: అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా మారింది. ముందస్తు చర్యలు లేకుండా డ్రైనేజీ పైప్‌లైన్‌ల మరమ్మతులు చేపట్టడంతో డ్రైనేజీల నుంచి మురుగు నీరు పొంగి రోడ్లను ముంచెత్తింది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి. గురువారం సాయంత్రం అధికారుల భైరామల్‌గూడ చెరువు వద్ద డ్రైనేజీ మరమ్మతులు చేపట్టారు. సరూర్‌నగర్ నుంచి కర్మన్‌ఘాట్ వెళ్లే ప్రధాన రహదారిలో వడ్డెర బస్తీ, తపోవన్ కాలనీ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లు పొంగి డ్రైనేజీ నీరు రోడ్డు పైకి చేరి రోడ్డు చెరువును తలపించింది. గురువారం రాత్రితో పాటు శుక్రవారం ఉదయం కూడా మరోసారి డ్రైనేజీలు పొంగి పొర్లాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు డ్రైనేజీ నీటి నుంచి వచ్చే దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న వందల కాలనీ డ్రైనేజీ నీరు భైరామల్‌గూడ చెరువు మీదుగా బాక్స్ డ్రైన్‌ల ద్వారా సరూర్‌నగర్ చెరువులో కలుస్తాయి. భైరామల్‌గూడ చెరువు వద్ద డ్రైనేజీలో సమస్య రావడంతో అధికారులు మమ్మతులు చేపట్టడంతో ఒక్క సారిగా చెరువు నుంచి కింద నీరు వచ్చింది దీంతో సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొటరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బస్తీల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని బస్తీలన్నింటిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె బస్తీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఖాజాబాగ్‌లో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, బస్తీ నేతలు దేవి, సీతారాం నాయక్ పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోటి సంతకాల సేకరణ



ఆర్‌కేపురంలో సంతకాల సేకరణ నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: బీసీలకు చట్టసభలు, విద్యలో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రంగారెడ్డి జిల్లా బీఎస్పీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ పి.వై.గిరి మహారాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ బీఎస్పీ ఉపాధ్యక్షుడు వీసం రవి అధ్యక్షతన ఆర్‌కేపురంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కోసం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరి మహారాజు మాట్లాడుతూ... ఎవరి జనాభా ఎంతనో అంత రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బహుజన రాజ్యమే తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ ప్రధాన కార్యదర్శి నరేశ్, డివిజన్ కార్యదర్శి పులి శ్రీనివాస్, బాల్ రాజ్, సాక్షి, మేడి శ్రీనివాస్, మహేశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.